క్లుప్తంగా

గిరిజన కాలనీల్లో అన్నదానం



కావలి : కావలి పట్టణ పరిసర ప్రాంతాల్లోని శివ రామ సుబ్బయ్య గిరిజన కాలనీ, చెరువుకట్ట గిరిజన కాలనీ, బుడంగుంట గిరిజన కాలనీల్లోని పేదలకు శిఖరం శ్రీనివాస వరప్రసాదరావు నాలుగో వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపకుడు సురేంద్ర మాట్లాడుతూ శ్రీనివాస వరప్రసాదరావు కుటుంబ సభ్యులు నాలుగేళ్లుగా తమ సంస్థ ద్వారా పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

ఉదయగిరి రూరల్ : వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయగిరి అటవీ రేంజ్ పరిధిలో మూగజీవాల దాహార్తి తీర్చి సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు రేంజ్ అధికారి బీఎస్ కుమార్ రాజా తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడారు. రేంజ్ పరిధిలో వివిధ రకాల వన్యప్రాణుల ఉన్నాయన్నారు. అవి సంచరించే ప్రాంతాల్లో ఇప్పటికే నీటికుంటలు, చెక్ డ్యామ్‌లు, సాసర్ కుంటల నిర్మాణాలు చేపట్టామన్నారు. మరిన్ని నిర్మాణాలు చేపట్టేందుకు మరికొన్ని ప్రతిపాదనలు తయారుచేస్తున్నామన్నారు.

మర్యాదపూర్వకంగా..



జెడ్పీ చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉదయగిరి : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డిని మాజీ సొసైటీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి శుక్రవారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయగిరిలో నిర్మాణంలో ఉన్న మండల పరిషత్ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ మూలె వెంకటసుబ్బారెడ్డి ఉన్నారు.

దాచూరి రామిరెడ్డికి నివాళి



ఉదయగిరి : పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు దాచూరి రామిరెడ్డి తొమ్మిదో వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు దాచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంలో దాచూరి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. యూటీఎఫ్ నాయకులు హనీఫ్, షేక్.గాజుల మున్నా, షేక్.ఖాదర్‌బాషా, గాజులపల్లి సుబ్బారెడ్డి, రామిరెడ్డి, దస్తగిరి అహ్మద్, నల్లబోతుల రామకృష్ణ, ఫణి, ఆర్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

దుత్తలూరు : మండలంలోని సోమలరేగడ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారాముల దేవస్థానంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో మూడోరోజు శుక్రవారం గ్రామోత్సవం, జతహోమం, అర్చన, చండీహోమం, పంచామృతాభిషేకం, సహస్రనామ పూజలు జరిగాయి. హోమ కార్యక్రమంలో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఉపాధి పనుల పరిశీలన

కలిగిరి : మండలంలోని కలిగిరి, అనంతపురం, కావలి ముస్తాపురం, సిద్ధనకొండూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి శుక్రవారం పరిశీలించారు. కూలీలకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. నీటితొట్టెలు, ఉద్యానవన తోటలను పరిశీలించారు.

కుంభాభిషేకానికి ఆహ్వానం



కావలి : పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో పునఃప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవానికి కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సతీమణి ఆదిలక్ష్మిని పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు శుక్రవారం ఆహ్వానించారు. ఈ మేరకు రామిరెడ్డి నివాసంలో ఆహ్వాన పత్రికలు అందజేశారు.

చేతికొచ్చే దశలో నేలపాలు



గండిపాళెం సమీపంలోని పొలాల్లో నేలవాలిన వరిపైరు

మండలంలోని గండిపాళెంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, అకాల వర్షానికి వరి పంట నేలవాలింది. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంట చేతికొచ్చే దశలో నేలవాలడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామ పరిసరాల్లో సుమారు పదెకరాల్లో పంట నెలకొరిగింది. దీంతో రైతులు పంటను చూసి ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాధికారులు గ్రామంలో పర్యటించి నేలవాలిన పంటను గుర్తించి నమోదు చేసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

– ఉదయగిరి రూరల్

కంపచెట్లను తొలగించరూ..



ట్యాంక్ చుట్టూ ఏపుగా పెరిగిన కంపచెట్లు

మండలంలోని గండిపాళెం బీసీ కాలనీ సమీపంలో ప్రజల తాగునీటి అవసరాలకు కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ చుట్టూ ఏపుగా కంపచెట్లు పెరిగి ముళ్లపొదను తలపిస్తోంది. పంచాయతీ పాలకవర్గం కంపచెట్లను తొలగించకపోవడంతో ఆ ప్రాంతంలో విషపురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు తెలిపారు. రాత్రివేళ అటువైపుగా వెళ్లాలంటే భయపడాల్సి వస్తోందన్నారు. ట్యాంకు కూడా పెచ్చులూడి పోయి ఉండడం, నీటి లీకేజీ అవుతుండడంతో వాడకం లేక శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలని కోరుతున్నారు.

– ఉదయగిరి రూరల్

మానవత్వం చాటుకున్న యువకులు



ఆనకట్ట నుంచి గేదెను బయటకు తీస్తున్న యువకులు

పట్టణ సమీపంలోని ఆనకట్ట నీటిలో ప్రమాదవశాత్తు గేదె పడింది. వెంటనే పలువురు యువకులు సమయస్ఫూర్తితో వ్యవహరించి గేదెను ప్రాణాలతో బయటకు తీసి రక్షించారు. ఆనకట్ట వైపు శుక్రవారం మేతకు వెళ్లిన గేదె ప్రమాదవశాత్తు ఏపుగా పెరిగిన జమ్ము, గుర్రపుడెక్క ఉన్న నీటిలో ఇరుక్కుని అరుస్తూ ఉండటంతో అటువైపుగా వెళ్లిన యువకులు గుర్తించి గంటపాటు శ్రమించి తాళ్ల సహాయంతో బయటకు తీసి కాపాడారు. దీంతో వారిని పలువురు అభినందించారు.

– ఉదయగిరి

సెగలు కక్కుతున్న సూరీడు

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం 8 నుంచే భానుడి భగభగలు
- బయటకు రావడానికి జంకుతున్న జనం



ఉదయమే నిర్మానుష్యంగా ఉన్న జలదంకి బస్టాండ్ సెంటర్ రోడ్డు

జలదంకి(ఉదయగిరి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో సూరీడు సెగలు కక్కుతున్నాడు. ఉదయం 8 గంటల నుంచే ఎండ వేడిమి మొదలవుతుండడంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. 11 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. తప్పనిసరి పరిస్థితిలో ఎండలో బయటకు రావాల్సి వస్తే కుండువా లేదా గొడుగు లేదా టోపీ ధరించాలని.. నీటి బాటిల్ వెంట ఉంచుకోవాలని, వీలైనంతవరకు ఎండలో తిరగకుండా పనులు పూర్తి చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇక వేడిగాలులకు వడదెబ్బ బారిన పడకుండా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

మధ్యాహ్న ప్రయాణాలు తగ్గించుకోవాలి

వేసవిలో వీలైనంతవరకు ప్రయాణాలు తగ్గించుకోవడం మేలు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువ. వీలైనంత వరకు ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం 5 తరువాత ప్రయాణాలు చేస్తే మంచిది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నీటిని ఎక్కువగా తీసుకోవాలి.
- నీటి శాతం అధికంగా ఉండే పండ్లను తీసుకోవాలి
- పండ్ల రసాల కన్నా పండ్లను తింటే ఎక్కువ లాభం ఉంటుంది.
- తేలికపాటి, నూలు, లేత రంగు, వదులుగా ఉండే దుస్తులు ధరించాలి.
- సాధ్యమైనంత వరకు ప్రయాణాలు మానుకోవడం ఉత్తమం.
- అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎండలో వెళ్లేటప్పుడు గొడుగు లేదా టోపీ ధరించాలి.

ఉదయగిరి నియోజకవర్గంలో..

తేదీ	ఉష్ణోగ్రత (డిగ్రీలలో)
ఏప్రిల్ 27	39
ఏప్రిల్ 28	39
ఏప్రిల్ 29	40
ఏప్రిల్ 30	41
మే 1	42
మే 2	42

అప్రమత్తంగా ఉండాలి



ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ప్రయాణాలకు దూరంగా ఉండాలి. చల్లని పానీయాలు తరచూ తీసుకోవాలి. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్రిజ్‌లోని నీటి కంటే కుండలలోని నీరు శ్రేష్ఠమైనవి.

– జె.పద్మజ, గట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టి కృషి

- మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



విక్రమ్‌రెడ్డి, నాయకులకు సన్మానం

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరం సమష్టిగా కృషి చేద్దామని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పార్టీ నాయకులు, ఇటీవల వివిధ కమిటీల్లో పదవులు పొందిన వారితో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి రాష్ట్రంలో జనాదరణ ఏ మాత్రం తగ్గలేదన్నారు. అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా హాజరవుతున్న జనసందోహమే దీనికి నిదర్శనమన్నారు. జగనన్న నాయకత్వంలో కష్టపడి పనిచేసి తిరిగి పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. విక్రమ్‌రెడ్డి, ఆదిశేషయ్య, అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, నాగలపాటి ప్రతాప్‌రెడ్డి, నందా ఓబులేసుని నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆంద్రా సుబ్బారెడ్డి, అనంతసాగరం కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, కౌన్సిలర్ కామాక్షయ్య నాయుడు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కల్పనారెడ్డి, సయ్యద్ జమీర్, తోడేటి మణి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల దాడులు

- పలువురికి గాయాలు

జలదంకి(ఉదయగిరి): జలదంకి గ్రామంలో రెండు వర్గాల మధ్య దాడులు జరగడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తున్నట్లు కలిగిరి సీఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్సై లతీఫున్నీసా శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన ఒంగోలు రాఘవేంద్ర, రాజాలు శుక్రవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా ఎస్టీ కాలనీకి చెందిన దేవరకొండ వజ్రమ్మకు వీరితో చిన్న గొడవ జరిగింది. అనంతరం ఆమె తన కుమారుడు రమేష్, కోడలు తిరుపతమ్మకు తెలపడంతో ఆ వర్గానికి చెందిన దాదాపు 20 మంది రాఘవేంద్ర ఇంటికి వెళ్లి కర్రలతో దాడులు చేశారు. దీంతో రెండు వర్గాలకు చెందిన పలువురికి గాయాలయ్యాయి. కాగా శనివారం ఉదయం ఎస్సీ కాలనీకి చెందిన రేవతి బైక్‌పై వెళ్తుండగా వజ్రమ్మ కుమారుడు రమేష్ ఎస్టీ కాలనీ సమీపంలో అడ్డుపడి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె కుటుంబసభ్యులకు తెలపడంతో ఎస్సీ కాలనీవాసులు ఎస్టీ కాలనీవాసులపై దాడులకు దిగి బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఇరువర్గాలకు చెందిన వారు చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు వెళ్లారు. సీఐ వెంకటనారాయణ, ఎస్సై లతీఫున్నీసాలతో పాటు కొండాపురం, కలిగిరి, కావలి ఎస్సైలు గ్రామంలో విచారణ జరిపి ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో–బైక్ ఢీ

అనుమసముద్రంపేట : ఆటో– బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు స్వల్పంగా గాయపడిన ఘటన మండలంలోని చిరమన వద్ద శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. నెల్లూరు నుంచి ఓ కుటుంబం ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాకు బయలుదేరారు. అదే సమయంలో ఏఎస్‌పేటకు ఇద్దరు యువకులు బైక్‌లో వస్తుండగా చిరమన వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో బోల్తా పడగా అందులోని ఇద్దరికి స్వల్పంగా గాయాలైంది. వీరిని 108లో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

భక్తిశ్రద్ధలతో శంకరాచార్యుల జయంతి



ఆత్మకూరు : పట్టణంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయంలో శంకరాచార్యుల జయంతిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు మేళ్లచెరువు శివకుమారశర్మ ఆధ్వర్యంలో తొలుత విశ్వేశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించి విశేషాలంకరణ చేశారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభం వద్ద శంకరాచార్యుల చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు గావించారు. హోమం తర్వాత ఉపనయనాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుకూరుపేట లలితా పరమేశ్వరి ఆశ్రమ నిర్వాహకుడు మహేషానందస్వామి అనుగ్రహభాషణం చేశారు. అనంతరం భారతి సంగీత నృత్య విద్యాలయ చిన్నారులతో నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

మండల టాపర్‌కు అభినందన



సోమశిల : పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అనంతసాగరం మండల టాపర్‌గా నిలిచిన చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కె.జ్ఞానేష్(586)ను తహసీల్దార్ వై.సుభాషిణి శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విద్యార్థిని శాలువతో సత్కరించారు. కష్టపడి చదివి కలెక్టర్ కావాలని జ్ఞానేష్‌ను దీవించారు. హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, మదీనా, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.





గ్రామోత్సవంలో రామానుజ, విష్ణుమూర్తి ఉత్సవ విగ్రహాలు

వైభవంగా గ్రామోత్సవం

కావలి : పట్టణ పరిధిలో శ్రీమహావిష్ణువు, రామానుజుల ఉత్సవ విగ్రహాలతో భక్తుల కోలాహలం నడుమ శుక్రవారం గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమలేశునికి ఆచార్యులైన రామానుజుల అవతారోత్సవాలు పట్టణంలోని విష్ణాలయంలో గత నెల 23న ప్రారంభమైంది. ఈ క్రమంలో గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి. కాగా భక్తుల కోలాటం, కోలాహలం నడుమ గ్రామోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.





కోలాటం ఆడుతున్న మహిళలు, చిన్నారులు

క్రికెట్ టోర్నీ విజేత కింగ్స్ ఎలెవన్ జట్టు



సీతారామపురం : మండలంలోని పబ్బులేటిపల్లి గ్రామంలో రామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ టోర్నీలో సీతారామపురం గ్రామానికి చెందిన కింగ్స్ ఎలెవన్ జట్టు విజేతగా నిలిచింది. గ్రామంలో శుక్రవారం జరిగిన పబ్బులేటిపల్లి జట్టు నిర్ణీత పది ఓవర్లలో వంద పరుగులు చేయగా సీతారామపురానికి చెందిన కింగ్స్ ఎలెవెన్ జట్టు 101 పరుగులతో లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మేరకు విజేతకు ప్రైజ్‌మనీ రూ.20 వేలను నిర్వాహకులు అందించారు.

నేత్రపర్వం.. పార్వేట ఉత్సవం



పార్వేటకు సిద్ధమైన ఉత్సవమూర్తులు

ఉదయగిరి రూరల్ : మండలంలోని గంగులవారి అయ్యవారిపల్లి గ్రామంలోని కోదండరామస్వామి ఆలయంలో పార్వేట ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఐదురోజుల పాటు సాగిన సీతారాముల ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి స్వామివార్లకు కల్యాణ మహోత్సవాన్ని గావించారు. శుక్రవారం ఉదయం ఆలయం వద్ద వసంతోత్సవం చేపట్టి స్వామివార్లను గ్రామోత్సవంగా తరలించి పార్వేట చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు వింజమూరుకు ఆరోగ్య శాఖ మంత్రి

వింజమూరు(ఉదయగిరి) : రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ శనివారం వింజమూరుకు రానున్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వైద్యాధికారులతో శుక్రవారం సమావేశమై ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 397 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకు రాగా 301 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 96 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి టి. ఇషాక్‌స్వర్ణదత్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210 పలకగా, సగటున రూ.250.11 లభించిందన్నారు. వేలంలో 15 కంపెనీలు పాల్గొన్నాయి.

డీసీపల్లిలో..

మర్రిపాడు : మండలంలోని డీసీపల్లి వేలం కేంద్రంలో శుక్రవారం 562 పొగాకు బేళ్లను విక్రయించినట్లు నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 707 బేళ్లు రాగా 562 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలియజేశారు. గరిష్ఠ ధర కిలో ఒక్కటింటికి రూ.280 రాగా కనిష్ఠ ధర రూ.210 లభించింది. వేలంలో 13 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.


విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

దుత్తలూరు : దుత్తలూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ వెంకటసుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పలువురికి మేకపాటి పరామర్శ



గుండాల బాలచంద్రారెడ్డితో మాట్లాడుతున్న విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరులో రహీమ్‌ను పరామర్శిస్తున్న విక్రమ్‌రెడ్డి

సంగం : మండలానికి చెందిన పలు వైఎస్సార్‌సీపీ కుటుంబాలను ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సిద్దీపురం గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి గుండాల జీవన్ చంద్రారెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. విద్యార్థి పెదనాన్న, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుండాల బాలచంద్రారెడ్డి, ఆయన సోదరుడు సతీష్ రెడ్డిలను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా సంగానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కంటాబత్తిన రఘునాథరెడ్డి సోదరుడు శశిధర్‌రడ్డి ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబసభ్యులను విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కరిముల్లా, మండల ఉపాధ్యక్షుడు సూరి మదన్‌మోహన్‌రెడ్డి, పి.ఫణికుమార్‌రెడ్డి, సర్పంచ్ మానికల చందు, రావుల ప్రసాద్‌గౌడ్, ఊటుకూరు జనార్దన్‌రెడ్డి, శివ, శంకరయ్య, కోటారెడ్డి తదితరులు ఉన్నారు.

- ఆత్మకూరు : పట్టణంలోని 15వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు షేక్.రహీంను ఇటీవల తప్పుడు కేసు పెట్టి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బెయిల్‌పై వచ్చి ఉన్న ఇంటి వద్ద ఉన్న రహీంను మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. అలాగే నాలుగో వార్డులో పార్టీ నేత చెర్లో రమణారెడ్డి అనారోగ్యానికి గురికావడంతో ఆయన్ను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 22వ వార్డు బీసీకాలనీలో పార్టీ నేత కోటకొండ తిరుపాలును కలిసి ఆయన ఆరోగ్య విషయమై వాకబు చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నాగలపాటి ప్రతాప్‌రెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, పార్టీ న్యాయవాదుల కమిటీ కన్వీనర్ నందా ఓబులేసు, మహిళా నాయకులు పర్వీన్, కల్పనారెడ్డి, ముజీబ్, కొప్పోలు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
- ఏఎస్‌పేట జెడ్పీటీసీ సభ్యురాలు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మను నెల్లూరులోని ఆమె నివాసంలో మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం రాత్రి పరామర్శించారు. ఇటీవల ఆమె కాలికి గాయమై ఆస్పత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న క్రమంలో ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఆమె భర్త, పార్టీ మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి ఉన్నారు.